సీఎం చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి

మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి

అచ్చంపేట, మే 8: పాలకుల అనాలోచిత నిర్ణయాలు, ఉచిత పథకాలతో రాష్ట్రం దీవాల తీసిందని, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జక్కా రామస్వామి అన్నారు. గురువారం పట్టణంలోని డీటీఎఫ్ జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన పెండింగ్ సమస్యలు పరిష్కరించమని అడగడం తప్పా అని ప్రశ్నించారు. ఐదు డీఏలు, పీఆర్సీలతో పాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని అడుగుతున్నామని అన్నారు. ఉపాధ్యాయులను అవమానిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలకు మేలైన పథకాలు, సంక్షేమం అందించడంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎప్పుడు ముందుంటారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని రావాల్సిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, జిల్లా బాధ్యులు యాదగిరిరావు, మోతిరాం, డీటీనాయక్, ఎన్. మోతిరాం, శోధన్‌బాబు, సుజాత, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నాగర్‌కర్నూల్, మే 8: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టం కింద భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే/సబ్ డివిజన్ మ్యాప్ సమర్పించడం తప్పనిసరిగ్గా మారుతున్నందున, అర్హత కలిగిన అభ్యర్థులు లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్ శిక్షణకు ఈ నెల 17లోపు మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లే ప్రతి దరఖాస్తుదారుడు సీఎస్ఎస్ఎల్ఆర్ ద్వారా తెలియజేయబడిన తేదీ నుంచి సర్వే/సబ్ డివిజన్ మ్యాప్‌ను కూడా సమర్పించాల్సి ఉంటుందన్నారు. సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో అర్హత కలిగిన సర్వేయర్లు సరిపడా సంఖ్యలో లేనందున 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మంది లైసెన్స్ సర్వేయర్లను అర్హత ప్రాతిపదికన ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లైసెన్స్ సర్వేయర్‌గా ఎంపికైన వారు నెలకు సుమారు 30 వేలకు పైగా ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 26నుంచి జూలై 26 వరకు రెండు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు.

తలసేమియాను తరిమేద్దాం

- ఉప జిల్లా వైద్యాధికారి వెంకటదాస్

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నాగర్‌కర్నూల్ రూరల్, మే 8: జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రపంచ తలసేమియా అవగాహన ర్యాలీని ఉప జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. వెంకటదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా అనేది జన్యుపరమైన రక్తరుగ్మత అని అన్నారు. తలసేమియా వ్యాధికి జన్యుపరమైన లోపం ఉన్న తల్లిదండ్రులు ద్వారా వారి సంతానానికి సంక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి ఉన్న చిన్నారులు అలసిపోవడం, పెరుగుదల లోపించడం, తరచుగా అంటువ్యాధులకు గురి కావడం తదితర లక్షణాలతో బాధపడుతుంటారన్నారు. వీరికి ప్రతి నెలా రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మేనరికపు వివాహాలు చేసుకోవడానికి ముందు తలసేమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవడంతో తలసేమియా వ్యాధి నివారణ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, వైద్యాధికారి డాక్టర్ వాణి, ఎంఎల్‌హెచ్ పీలు నీరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, మే 8: మండలంలోని మన్ననూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి తలసేమియా లక్షణాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు జాన్సన్, వైద్య సిబ్బంది, ఆరోగ్యకార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులు సత్వర పరిష్కారం

మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి రమాకాంత్

నాగర్‌కర్నూల్ రూరల్, మే 8: జిల్లా కోర్టు ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాల్లో బ్యాంక్ ఉన్నతాధికారులు, జిల్లా ఎలక్ట్రిసిటీ బోర్డు ఉన్నతాధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రమాకాంత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వచ్చేనెల 14న నిర్వహించే రెండవ జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎన్ఐ యాక్ట్‌లు, ఇతర సివిల్ కేసులకు సంబంధించి నోటీసులు పంపించి రాజీమార్గం ద్వారా సత్వరంగా కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. దీంతో సమయభావం, ఖర్చులు ఆదా అవుతాయని, రాజీమార్గంతో ఇరువర్గాలు సుఖసంతోషాలతో జీవించవచ్చని అన్నారు. ఈ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీమాసుల్తానా, బ్యాంక్ ఉన్నతాధికారులు, ఎలక్ట్రిసిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దకొత్తపల్లి, మే 8 : మండలంలోని పెద్దకార్పాముల లో గురువారం ప్రత్యేకాభివృద్ధి నిధుల నుంచి సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ విష్ణు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, నాగబాబు, ఎండీ కాశీం పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కల్వకుర్తి, మే 8 : పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖాన ఆవరణలో సీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

తాడూరు, మే 8:ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలు మరింత దూకుడుగా అమలు చేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8గంటల పని విధానం రద్దు చేసి వాటి స్థానంలో 12 గంటల పని చట్టబద్ధం చేస్తూ మోడీ ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. కైరత్‌బై, సుబ్బయ్య, బాలయ్య, యాదమ్మ, జ్యోతి, బాలమణి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

- కలెక్టర్ బదావత్ సంతోష్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెంట్లవెల్లి : జటప్రోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పెంట్లవెల్లి, మే 8 : భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తునట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని రైతుల నుంచి దరఖాస్తూలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టం అమలులో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలన్నారు. గతంలో ప్రజలు తాసీల్దార్, ఆర్డీవో లేదా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ఆధికారులు స్వయంగా గ్రామాలకే వచ్చి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని వివరించారు. ధరణీచట్టంలోని లోపాలన్నిటిని పరిష్కరించేందుకు భూభారతి చట్టం రూపొందించడం జరిగిందని, ఈ చట్టం అన్ని రకాల భూ సమస్యలకు పరిష్కారం చూపిస్తుందని, కావున ప్రజలందరూ తమకున్న భూ సమస్యలను గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకురావాలిని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్, పెంట్లవెల్లి, కోడేరు తాసీల్దార్లు జయసింహా, విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, గోప్లాపురం గ్రామాల్లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకు వచ్చిన ధాన్యాని మ్యాచేస్ వచ్చిన వెంటనే కాంటా వేసి రైస్ మిల్లర్లకు తరలించాలని ఏపీఎం గౌస్‌కు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో అవకతవకలతో పాటు, రైతుల పట్ల నిర్లక్ష్యదోరణి అవలంభిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

నాగర్‌కర్నూల్, మే 8: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సంతోశ్ గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను, పోలీస్ బందోబస్తు తీరును పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవి కుమార్, రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

పోతిరెడ్డిపల్లి చెరువు పరిశీలన

పోతిరెడ్డిపల్లిలో చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాజిపేట, మే 8: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో చెరువును ఎమ్మెల్యే డా రాజేశ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గ్రామంలోని మేలకుంట నుంచి తన వ్యవసాయ పొలానికి నీటి తరలించేందుకు పైప్‌లైన్ నిర్మాణం చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. చెరువులో నీటిని తరలిస్తే చేపల పెంపకానికి ఇబ్బందులవుతాయని పనులు అడ్డుకోవడంతో ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకరాగా, ఆయన గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఇరువర్గాలను ఎమ్మెల్యే సర్దిచెప్పారు. ఆయనతోపాటు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెద్దకొత్తపల్లి, మే 8 : మండలంలోని కల్వకోలులో గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి అడ్మిన్ సునీత, తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్ వీరాంజనేయులు మాట్లాడుతూ కొత్త వ్యక్తులు సమాచారాన్ని అడిగితే ఇవ్వొద్దని సూచించారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫోన్లకు వచ్చే వివిధ లింకులను ఓపెన్ చేయరాదని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో గ్రామ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

పెద్దకొత్తపల్లి, మే 8: మండలంలోని చంద్రకల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తాసీల్దార్ జేకే మోహన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. చంద్రకల్‌లో ఇప్పటివరకు 4800 బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తాసీల్దార్‌కు వివరించారు. ధాన్యం విక్రయించిన రైతులకు తప్పకుండా రశీదు ఇవ్వాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పీఏసీసీఎస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గడ్డి వాము దగ్ధం

కోడేరు, మే 8 : ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సుమారు రూ.50 వేల ఆస్తినష్టం జరిగిన ఘటన మండలంలోని పసుపులలో గురువారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కోడేరు మండలం పసుపుల గ్రామానికి చెందిన అంకిరావుపల్లి శ్రీనివాసులుకు చెందిన గడ్డివామును గ్రామ సమీపంలో నిల్వ చేశాడు. అయితే గురువారం సాయంత్రం ఆకస్మికంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

గాంధీ విగ్రహంపై మంత్రి అనుచరుల రాజకీయం తగదు

గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కొల్లాపూర్ రూరల్, మే 8 : కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చౌటబెట్లలో మూడేండ్ల కిందట మహాత్మాగాంధీ విగ్రహాన్ని గ్రామ రైతులందరం కలిసి చందాలతో నిర్మించుకొని అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతుల మీద ఆవిష్కరించినట్లు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సత్యంయాదవ్ తెలిపారు. గురువారం కొల్లాపూర్‌లోని గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీని స్ఫూర్తిగా తీసుకొని కేసీఆర్ శాంతియుతంగా తెలంగాణ ఉద్యమం చేపట్టి రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. అయితే అధికార కాంగ్రెస్ నాయకులు గ్రామ బొడ్రాయికి గాంధీజీ విగ్రహం అడ్డంగా ఉందని రాజకీయ కోణంలో ఆలోచన చేసి విగ్రహాన్ని వేరే ప్రాంతంలోకి మార్చాలన్న దురాలోచన, కుట్రలను మేము ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేత ఏర్పాటు చేశారని ఇది ఎంత ప్రజాస్వామ్యమైన చిన్న మనస్సును ప్రతిబింబించే విధంగా ఉంది, గాంధీజీ ఏ పార్టీ చెందినవారు కాదని మర్చిపోకూడదు. ఆయన దేశాన్నికి చెందినవాడు ఆయన విగ్రహాన్ని పెట్టింది బీఆర్ఎస్ పార్టీ నేత అయినంత మాత్రానా, గాంధీజీ చరిత్ర బీఆర్ఎస్‌కు చెందినది అవుతుందా అని ప్రశ్నించారు. వ్యక్తి ఎవరు పెట్టారన్నాదాన్ని బేస్ చేసుకొని విగ్రహాన్ని తొలగించడం కాదని అక్కడ ఎవరి విగ్రహం ఉందనే ఆలోచన చేయాలని సూచించారు. విగ్రహాన్ని అక్కడి నుంచి మార్చొద్దని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్, తాసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు వినతిపత్రాలు కూడా అందజేసినట్లు గుర్తు చేశారు. అయినా అధికార పార్టీ నాయకుల ప్రొద్బలంతో అధికారులు గాంధీజీ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేస్తే అడ్డుకుంటామని ప్రకటించారు. దీనిపై అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి వందనం ..

అచ్చంపేటరూరల్, మే 8: భారత సైన్యం ధైర్యంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టి విజయవంతంగా పూర్తి చేసినందుకు గురువారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సైనికులకు సెల్యూట్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మిత్ర మండలి, అంజనీ మాత సేవా సమితి, వనవాసీ సేవా సమితి బాధ్యులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటటౌన్, మే 8: పట్టణంలోని ఐఎన్‌టీయూసీ నాయకులు ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు మహబూబ్ అలీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ రామనాథం, ఎండీ గౌస్ పాషా, చందునాయక్, మౌలానా, రాజు, స్వామిగౌడ్, నీలం శేఖర్, గణేశ్, లాలునాయక్, వెంకటేశ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సైనికులకు వందనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కలెక్టర్‌కు వినతి

వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, మే 8: సమగ్ర కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక, విద్యా ఉద్యోగ రాజకీయ కులగణన సర్వేను జిల్లాలోని ఉపాధ్యాయులు, ఎన్యుమరేటర్లు పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. ఆరు నెలలు గడిచినా ఉపాధ్యాయులకు నేటికీ చెల్లించలేదన్నారు. సర్వేలో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కుర్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చేయూత

ఊర్కొండ, మే 8 : మండలంలోని మాదారం గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీఎం సంతోష్ సూచించారు. గురువారం మాదారం, రాచాలపల్లి పాఠశాలలకు చెందిన 175 యూనిఫాం జతలను కుట్టేందుకు మహిళా సంఘాల సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

కొల్లాపూర్ రూరల్, మే 8: కొల్లాపూర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీసీఎస్ చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్నితాలు లేకుండా తీసు కువచ్చి, ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం ప్రకారం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించే క్రమంలో రైతులను పిలిపించి లారీల్లోంచి ధాన్యాన్ని దించించడం వంటివి మిల్లు యజమానులు చేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకు ంటుందని చెప్పారు. ఆయన వెంట మార్కెట్ అధికారులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్వ్యూలు

చారకొండ: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

చారకొండ, మే 8 : రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తుదారులకు మండలంలో రైతు వేదికలో ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. గురువారం ఎస్టీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 438 దరఖాస్తు చేసుకోగా, 322 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థుల దృవీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు నర్సింహ, శివప్రసాద్, ఏపీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, మే 8 : మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మాదారం, గుడిగాన్‌పల్లి, రేవల్లి, రాచాలపల్లి, తిమ్మన్నపల్లి గ్రామాల నుంచి 175 దరఖాస్తుదారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, యూకో బ్యాంక్ మేనేజర్ హరిశ్చంద్ర ప్రసాద్, ఏపీఎం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, మే 8 : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంకు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 626 మంది యువకులు హాజరయ్యారు. మండల కేంద్రంతోపాటు, దేవునితిర్మాలపూర్, వెన్నచెర్ల, చంద్రకల్, ముష్టిపల్లి, నక్కలపల్లి, బాచారం గ్రామాలకు చెందిన బీసీ కేటగిరి చెందిన చెందిన యువత హాజరైనట్లు ఎంపీడీవో నాగేంద్రం తెలిపారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, మే 8: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక యూబీఐ పరిధిలో ని 9గ్రామాలకు చెందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 462 మందికి గాను 305మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో లక్ష్మీదేవి తెలిపారు. 157మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఇంటర్వ్యూకు 211మంది హాజరు..

ఉప్పునుంతల, మే 8: గురువారం స్థానిక మండల ప రిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో మోహన్‌లాల్ తెలిపారు. 352మంది దరఖాస్తులు చేసుకోగా 211మంది హాజరైనట్లు తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపీవో నారాయణ, అచ్చంపేట ఎస్బీఐ మేనేజర్, ఏపీఎం తిర్పతయ్య పాల్గొన్నారు.

ఉప్పునుంతలలో..

లింగాలలో..

లింగాల, మే 8: రాజీవ్ వికాస్‌కు దారఖాస్తులు చేసుకున్న వారికి గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్‌లు సోముకుమార్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బల్మూర్‌లో..

బల్మూరు, మే 8: రాజీవ్ వికాసం కోసం దారఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 12నుంచి ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాఘవులు తెలిపారు.

176 మంది దరఖాస్తుల పరిశీలన..

వంగూరు, మే 8 : రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మచారి ఆధ్వర్యంలో 176 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

అచ్చంపేటలో

అచ్చంపేటరూరల్, మే 8: నిరుద్యోగ యువతి, యువకులకు ఈ నెల 12 నుంచి 19వరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ గౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు.

ఊర్కొండ: ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దకొత్తపల్లిలో..

పరామర్శిస్తున్న మర్రి జనార్ధన్‌రెడ్డి

ఆర్టీసీ ఉద్యోగి కుటుంబాన్ని పరామర్శించిన మర్రి

నాగర్‌కర్నూల్, మే 8: జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఇటీవల ఆర్టీసీ ఉద్యోగి నారాయణ తల్లి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, బీఆర్ఎస్ నాయకులు ఆలూరి నరేందర్, పాండు తదితరులు ఉన్నారు.

విద్యానైపుణ్యాలను పెంచుతాయి

- డీఈవో రమేశ్‌కుమార్

నాగర్‌కర్నూల్ రూరల్, మే 8: వేసవి శిబిరాలు విద్యార్థులకు వినోదం, విద్యానైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి తోడ్పడుతాయని డీఈవో రమేశ్‌కుమార్ అన్నారు. గురువారం తెలకప